క్లుప్తంగా

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

సి.బెళగల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, దీని వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో పర్యటించి వీధుల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తర్వాత గ్రామ చివరనున్న చెత్త సేకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వర్మీ కంపోస్ట్ ఎరువును పరిశీలించి గ్రామ ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చెత్త సేకరణ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌ను ఆదేశించారు.

భూ రీసర్వేకు సహకరించండి

సి.బెళగల్: మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామంలో శనివారం తహసీల్దార్ శేషఫణి రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించారు. ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న ఆయన స్థానికులతో మాట్లాడారు. భూ సమస్యలపై ఆరా తీశారు. భూ రీసర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, వీఆర్వో సాయిరమణ, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

సి.బెళగల్: జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం మండల పరిధిలోని ముడుమాల, కొండాపురం గ్రామాల్లోని సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జగనన్న సురక్ష కార్యక్రమ అమలు విధానాలు, నిర్వహణపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు, వలంటీర్లు కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, వారికి ప్రభుత్వం నుంచి అందిన సేవలు, అందాల్సిన సేవలను నమోదు చేయాలన్నారు.

ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలి

కోడుమూరు రూరల్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. శనివారం ఎంఈఓ శరభయ్యకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తూ విద్యారంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేస్తున్నప్పటికీ.. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజు దోపిడీని అరికట్టడంలో విఫలమైందన్నారు. ఇకనైనా విద్యాశాఖాధికారులు స్పందించి అధిక ఫీజు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు వీరాంజనేయులు, సుధాకర్, హరి, సంజీవ్ తదితరులున్నారు.

కోనా వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండలం పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామం కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసి మూడునెలలు కావడంతో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ నిర్వహించారు. స్వామితో పాటు భూదేవి, అలివేలి మంగమ్మలకు గ్రామోత్సవం జరిపారు.

రేపు 'ఆదర్శ' ప్రవేశ పరీక్ష

గూడూరు రూరల్: జులకల్ ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 26న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ దిల్షాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆధార్ కార్డుతో ఉదయం ఆదర్శ పాఠశాల వద్ద హాజరు కావాలన్నారు. 10 నుంచి 11 గంటల వరకు రాత పరీక్ష ఉంటుందని, మార్కుల ఆధారంగా ప్రవేశమన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలివ్వాలి

పాణ్యం: ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పాణ్యంలోని నాలుగు కూడళ్ల వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఇందులో జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాప్, నాయకులు మధుకిరణ్, మహేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష

పాణ్యం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామాల్లో పకడ్బందీగా చేపట్టాలని ప్రత్యేక అధికారి నాగరాజు , స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం పాణ్యంలోని సచివాలయం-1 ఆధ్వర్యంలో చేపట్టిన సురక్ష సర్వేను వారు పరిశీలించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

గడివేముల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. శనివారం మండల కేంద్రమైన గడివేములలో ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు.

గుండె పోటుతో యువకుడి మృతి

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని పర్లలో పిట్టల మధు(25) అనే యువకుడు శనివారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. వ్యక్తిగత పనిమీద కర్నూలుకు వెలుతుండగా హఠాత్తుగా గుండె పోటు వచ్చింది. హాస్పిటల్‌కు తరలించే లోపు మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమ్లానాయక్ తెలిపారు. మృతుడికి భార్య మహాలక్ష్మి, ఒక పాప ఉన్నారు.

పాడికి బీమా.. రైతుకు ధీమా!

- పాడి రైతులకు సర్కారు భరోసా
- వైఎస్సార్ పశుబీమా పథకానికి శ్రీకారం
- మూగజీవాలు మరణిస్తే పరిహారం
- తాజాగా బాధిత రైతులకు సాయం విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న పశుపోషకులు


ఆవుల మంద

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలబడుతోంది. ఏదైనా కారణంతో పశువులు మరణిస్తే బీమా వర్తింప జేస్తోంది. వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకం స్థానంలో ప్రభుత్వం జూన్ 1 వ తేదీన 'వైఎస్సార్ పశుబీమా పథకం' ప్రవేశపెట్టింది. వివిధ రకాల వ్యాధులు లేదా ప్రమాదశాత్తు మూగ జీవాలు మృత్యువాత పడితే ఈ బీమా పథకం ద్వారా వాటి యజమానులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. పాణ్యం నియోజకవర్గంలో ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల, కల్లూరు మండలాల పరిధిలో చాలా మంది పాడిపశువుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో ఆయా మండలాల్లో వేలాది ఆవులు, బర్రెలు, మేకలు ఉన్నాయి. గతంలో అవి ఏవైనా కారణాలతో మృత్యువాత పడితే పాడి రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీమా పథకం ప్రవేశపెట్టడంతో కష్ట కాలంలో ఊరట లభిస్తుంది.

20 శాతం ప్రీమియంతో పరిహారం

పశుబీమా పథకం వర్తింపునకు ఎస్సీ, ఎస్టీ,

పాణ్యం నియోజకవర్గంలో వివిధ కారణాలతో మృత్యువాత పడిన పశువులు, మంజూరైన పరిహారం

మండలం	బర్రెలు	పరిహారం	ఆవులు	పరిహారం
పాణ్యం	143	34,80,000	27	5,40,000
గడివేముల	129	25,65,000	25	3,95,000
కల్లూరు	307	92,10,000	96	28,80,000
ఓర్వకల్లు	53	15,90,000	125	33,75,000

మండలాల వారీగా ఆవులు, బర్రెల వివరాలు

మండలం	ఆవులు	బర్రెలు
పాణ్యం	4,231	6,827
కల్లూరు	5,269	6,891
గడివేముల	2,638	3,621
ఓర్వకల్లు	8,622	7,190

నిరుపేద లబ్ధదారులు తమ వాటాగా 20 శాతం, మిగిలిన విభాగాల పాడి రైతులు 50 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ రైతులతోపాటు నిరుపేద పాడి రైతులు సంకరజాతి పశువులకు మూడేళ్లకాలానికి తమ వాటా కింద ఒక్కో పశువుకు రూ. 384 ప్రీమియం కట్టాలి. అదే దేశవాళి పశుజాతికి తమ వాటాగా రూ.480 చెల్లించాలి. ఇతర రైతులు సంకరజాతి పశువులకు రూ. 960 చెల్లించాలి. గొర్రెలు, మేకలు, పందులకు ఎస్సీ, ఎస్టీ, పేద వర్గాలు తమ వాటాగా ఏడాదికి రూ. 38, రెండేళ్లకు రూ. 54, మూడేళ్లకు రూ. 75 ప్రకారం చెల్లించాలి. ఇతర వర్గాల రైతులు ఏడాదికి రూ. 90, రెండేళ్లకు రూ. 135, మూడేళ్లకు రూ. 187.50 ప్రీమియం కట్టాలి. ఒకవేళ మరింత అధిక ధరకు బీమా చేయించుకోవాలంటే పశువు విలువను బట్టి ఎస్సీ, ఎస్టీ రైతులు 7.68 శాతం, ఇతర వర్గాల 9.5 శాతం చొప్పున ప్రీమియం చెల్లించాలి.

పరిహారం విడుదల

నియోజకవర్గంలో గడిచిన రెండేళ్లలో వివిధ కారణాలతో 905 బర్రెలు, ఆవులు మృతిచెందాయి. పరిహారం మంజూరు కోసం పశువైద్యాధికారులు ప్రభుత్వానికి రిపోర్టు పంపారు. ఇటీవల బాధిత పాడి రైతులందరికీ సర్కారు వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకం కింద పరిహారం విడుదల చేసింది. నాటు బర్రె, ఆవుకు రూ.15,000 చొప్పున, ముర్రె, ఒంగోలు జాతి రకం బర్రె, ఆవులకు రూ.30,000 చొప్పున ఖాతాల్లో జమ చేసింది.

పశు రకాన్ని బట్టి సాయం

సంకరజాతికి చెందిన ఆవులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే ఒక్కోదానికి రూ. 30 వేలు పరిహారం వర్తిస్తుంది. అలాగే దేశీయ పశుజాతి ఆవులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే రూ. 15వేల చొప్పున పరిహారం అందుతుంది. గొర్రెలు, మేకలు, మరణిస్తే ఒక్కోదానికి రూ. 6వేల ప్రకారం పరిహారం ఇస్తారు. ఒక్కో పాడి రైతు కుటుంబానికి బీమాకాలంలో ఐదు గేదెలు, ఆవులు, ఎద్దులకు, 50 మేకలు, గొర్రెలకు వర్తించేలా నిబంధన విధించారు. పాడి ఆవు కనీసం ఒక ఈత (2 నుంచి 10 సంవత్సరాల్లోపు వయసు). అలాగే పాడిగేదె కూడా ఒక ఈత(3 నుంచి 12 సంవత్సరాల వయసు) ఈని ఉండాలి. వ్యవసాయ ఎద్దులు సంకరజాతివి అయితే ఒకట్నిర సంవత్సరం నుంచి 10 సంవత్సరాలు, దేశవాళి ఎద్దులు అయితే 2 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలు వయసు ఉన్న పశువులు బీమా పథకానికి అర్హతగా పెట్టారు. గొర్రెలు, మేకలు ఆరు నెలల వయసు దాటి ఉండాలి. పశువుల వయసును పశువైద్యాధికారులు ధ్రువీకరిస్తారు. బీమా కింద నమోదయ్యే పశువులు, జీవాలకు చెవిపోగు వేస్తారు. ఏదైనా కారణంతో అవి మరణిస్తే 21 రోజుల్లోపు బీమా కంపెనీ నుంచి పాడి రైతుకు పరిహారం అందజేస్తారు.

రూ. 60 వేలు జమ



గత ఏడాది పాణ్యం పరిసర ప్రాంతాల్లో విషతుల్యమైన గ్రాసం తిని ఆరు ఆవులు చనిపోయాయి. వెంటనే పశువైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాను. సంఘటన స్థలానికి వచ్చి చనిపోయిన ఆవులను చూసి వాటికి పోస్టుమార్టం చేశారు. సాయం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపగా ఇటీవల నాకు రూ.60వేలు జమ అయ్యింది. ఈ సొమ్ముతో మరో రెండు ఆవులు కొని పోషించుకుంటాను.

–ముత్యాల మధు, పాడిరైతు,పాణ్యం

పశు బీమాపై అవగాహన

పాడి రైతుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది. తాజాగా వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ బీమా పశు యజమానులకు ఎంతో మేలు చేస్తుంది. పశుపోషకులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలి. ఆసక్తిగలవారు రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించి మూగజీవాలకు బీమా చేయించుకోవాలి.

– కమలాకర్ ఏడీ పశుసంవర్ధశాఖ పాణ్యం

గడప గడపకూ సంక్షేమ ఫలాలు


లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 33వ వార్డులో స్థానిక కార్పొరేటర్ నరసింహులు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులకే సంక్షేమ పథకాలు అందేవని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. పారదర్శక పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగప్ప, దేవపూజ ధనుంజయ ఆచారి, కె.పుల్లారెడ్డి, హనుమంతురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జగదీష్, భాస్కర్, తిరుపాల్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- ఆర్ కొంతలపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం


వృద్ధురాలితో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం ఆర్‌కొంతలపాడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల ద్వారా వారికి చేకూరిని లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్నా చాలా మంది కొన్ని సర్టిఫికెట్లు లేక పథకాలను అందుకోలేకున్నారని పేర్కొన్నారు. అందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. జూలై 1 నుంచి ప్రతి సచివాలయం పరిధిలో క్యాంపులు నిర్వహించి 11 రకాల సర్టిఫికెట్లు ప్రజలకు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఏ రాష్ట్రంలో కూడా పేదల సంక్షేమం కోసం రూ.2లక్షల కోట్లను వెచ్చించిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లని చెప్పారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ప్రజలెవరూ నమ్మొద్దని చెప్పారు. గతంలో 600 హామీలిచ్చి మోసం చేసిన చరిత్ర బాబుదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయనకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహెమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సచివాలయ కన్వీనర్లు మద్దిలేటి, సుంకన్న, మాజీ సర్పంచ్ దుబ్బన్న, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి


గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

సి.బెళగల్: ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్యామల మండల అధికారులకు ఆదేశించారు. శనివారం ఆమె ఎంపీడీఓ రాముడు, మండల అధికారులతో కలిసి పలుకుదొడ్డి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని అధికారులతో నమోదు చేయించారు. అనంతరం డీడీ మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లుతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని గుర్తించి అందజేయాలన్నారు. వీరివెంట ఈఓఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శులు ముస్తక్‌బాషా, శ్రీనాథ్, వీఆర్వో శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

ఉద్యమ కార్యాచరణ కరపత్రాలు విడుదల


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ ప్రకాశ్‌రావు, ఉపాధ్యాయులు

కర్నూలు (న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో చేపట్టిన ఉద్యమ కార్యచరణను విజయవంతం చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ ప్రకాశ్‌రావు అన్నారు. శనివారం మధ్యాహ్నం కర్నూలు మండలం గొందిపర్ల – వసంతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫెడరేషన్ ఆఫ్ ఏపీ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో)తో రూపొందించిన కార్యచరణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ ఉదయం 9గంటలకు జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా విద్యా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వసంతనగర్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సంపత్‌కుమార్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు ప్రసాద్, వెంకటరమణ గుప్త, మస్తాన్‌వలీ, శ్రీనాథ్, దత్తాత్రేయ, రాజ్యలక్ష్మీ, లత పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పేదలకు వరం


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటరాముడు

కర్నూలు (న్యూటౌన్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలకు వరమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు అన్నారు. శనివారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ ఆదివారం కర్నూలు నగరంలో కొత్త బస్టాండు వెనుక కార్మిక కర్షక భవనంలో జరిగే మండల జనరల్ బాడీ సమావేశానికి ఉపాధి కూలీలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటిపై అపోహలు వీడాలి


మాట్లాడుతున్న సర్పంచు అనూష

ఓర్వకల్లు: తాగు నీటిపై అపోహలు వీడాలని సర్పంచు తోట అనూష సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కలుషిత నీటిని తాగడంతోనే కొందరు అతిసార వ్యాధి బారినపడినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. దీంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు అప్రమత్తమై పలు ట్యాంకులు, మినరల్ వాటర్ ప్లాంట్లతో పాటు, బాధితుల ఇళ్లలోని నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం కర్నూలు ల్యాబ్‌కు పంపగా ఫలితాల్లో ఎలాంటి కలుషితం కాలేదని తేలిందన్నారు. ప్రజలు తాగునీటిపై ఎలాంటి అనుమానం పెట్టుకోవద్దన్నారు. పంచాయతీ కార్యదర్శి అజార్ అహ్మద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వినోద్‌కుమార్‌రెడ్డి, గంగీశ్వరరెడ్డి, వార్డు మెంబర్ కెపి ఎల్లయ్య పాల్గొన్నారు.

రోడ్డు భద్రతను పాటించండి

ఓర్వకల్లు: జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని హైవే అంబులెన్స్ సిబ్బంది వెంకటేష్ సూచించారు. శనివారం మండలంలోని నన్నూరు టోల్ ప్లాజా వద్ద వాహనాలను ఆపి రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష

- డీపీఓ బాలకృష్ణారెడ్డి


పెంచికలపాడు ప్రజలతో మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి

గూడూరు రూరల్: అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు డీపీఓ బాలకృష్ణారెడ్డి తెలిపారు. పెంచికలపాడులో ఎంపీడీఓ మాధవీలత ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వం 11 రకాల సేవలను ఉచితంగా అందించేందుకు జూలై 1 నుంచి సర్వే నిర్వహించనుందన్నారు. పథకాలు అందని వారిని గుర్తించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

కోడుమూరు రూరల్: సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండలంలోని అమడగుంట్ల, వెంకటగిరి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమ సర్వేను ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జయన్న పరిశీలించి సచివాలయ సిబ్బంది, వలంటరీలకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మంజుల, డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శంకరమ్మ పాల్గొన్నారు.

గూడూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవతం చేయాలని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం స్థానిక వీరభద్ర కళ్యాణ మంటపంలో మున్సిపల్ కమిషనర్ ప్రపాద్‌గౌడ్ అధ్యక్షతన సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. లక్ష్యం నెరవేరాలంటే సచివాలయ సిబ్బంది బాగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, మున్సిపల్ ఏఈ నరసింహులు, టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వర్లు, మెప్మా సీఎంఓ సూర్యనారాయణ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన

కల్లూరు: కె.మార్కపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) పి.బాలకృష్ణరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవైనా కారణాలతో అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందన్నారు. సచివాలయల స్థాయి జగనన్న సురక్ష క్యాంపులు జూలై 1న ప్రారంభమవుతయన్నారు. జూలై 1న కె.మార్కపురం సచివాలయంలో క్యాంపు ఏర్పాటు చేసి 11 రకాల సర్వీసులకు ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఈఓఆర్డీ రవికిషోర్, సర్పంచ్ గణ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి శ్రవన్, వలంటీర్లు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. శనివారం ఆయన కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ, వలంటీర్ల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, పంచాయతీ కార్యదర్శి చిన్న లచ్చప్ప, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులలో 1.110 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల డ్యాంలో 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు శనివారం డ్యాం అధికారులు తెలిపారు. కర్నూలు నగర వాసుల నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు.


27న మహాజన సంపర్క్ అభియాన్

కల్లూరు: ఈ నెల 27న కర్నూలు నగరంలోని బైరెడ్డి ఫంక్షన్ హాల్‌లో మహాజన సంపర్క్ అభియాన్ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు కె.చెన్నయ్య, ఉమ్మడి జిల్లాల మాజీ అధ్యక్షుడు జీఎస్ నాగరాజు అన్నారు. శనివారం కల్లూరు బీజేపీ కార్యాలయంలో కల్లూరు అర్బన్ మండలాధ్యక్షుడు ఎం.గంగాధర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయండి

గడివేముల: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఇంటి నిర్మాణాలను వచ్చే నెల 15వ తేదీ లోపల పూర్తి చేయాలని మండల స్పెషల్ అధికారి నాగరాజు తెలిపారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప,ఈఓఆర్డీ ఖాలీక్, ఏఈ మూర్తి పాల్గొన్నారు.

పత్తి పంట సాగుపై అవగాహన


పత్తిలో అధిక మొక్కల సాంద్రతపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత కల్యాణి

కల్లూరు: పత్తి పంటలో అధిక మొక్కల సాంద్రతపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. కల్లూరు మండలం లక్ష్మీపురంలో ప్రాంతీయ పరిశోధన వ్యవసాయ కేంద్ర (ఆర్ఎఆర్ఎస్) శాస్త్రవేత కళ్యాణి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సాధరణంగా పత్తి పంట విత్తుకోవడానికి రైతులు రెండు ప్యాకెట్ల విత్తనాలు వాడతారు. అధిక మొక్కల విత్తనాలు ఎకరాకు నాలుగు ప్యాకెట్లు విత్తుకోవాలన్నారు. పంట కాలం 140రోజుల్లో పూర్తవుతుందన్నారు. తర్వాత లక్ష్మీపురంలో 11 మంది రైతులకు ఒక్కొకరికి రూ. 3,400 విలువగల విత్తనాల ప్యాకెట్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

ఎంఈఓకు వినతి

ఓర్వకల్లు: ప్రైవేట్ విద్యా సంస్థల నిర్వహణలో ఫీజు రెగ్యులేటరీ కమిటీని పటిష్టంగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు శరత్‌కుమార్, నాయకులు రాజు, వలి, అశోక్, గోవర్ధన్, నవదీప్, శేషాద్రి, అభి తదితరులు శనివారం ఎంఈఓ సునందను కలిసి వినతి పత్రం అందజేశారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

పాణ్యం: పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన కడుగు మద్దిలేటి(56) కోలుకోలేక శనివారం మృతి చెందాడు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మద్దిలేటి కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి తీవ్రం కావడంతో ఈనెల 14న పురుగు మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారుడు ఉన్నారు. కుమారుడు మధుశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఓర్వకల్లు: నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునీల్ కుమార్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో డీలర్లు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని డీలర్లకు సూచించారు. కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు బిల్లులు ఇవ్వాలన్నారు. ప్రతి రోజు నోటీసు బోర్డులో స్టాక్ వివరాలను నమోదు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, ఎస్ఐ జయన్న పాల్గొన్నారు.